# "పాపం, అప్పారావు!"

—కె. యల్. యన్. మూర్తి

దబదబమని తలుపులు చప్పుడవడంతో అప్పుడే భోజనం చేసి నడుం వాలుద్దామని అనుకున్న అప్పారావుకి కించిత్ నిరుత్సాహం వచ్చింది. తలుపు కొడుతున్నవాళ్లు ఎవరై వుంటారా అని ఒక్క క్షణం ఆలోచించాడు. అయితే తలుపులమీద చప్పుడు ఆగలేదు.

''వస్తున్నా" అంటూ తలుపు తీయటానికి వెళ్లాడు అప్పారావు.

తలుపు తీసిన అప్పారావు కొంచెం ఆశ్చర్యపోయాడు. ఎదురింటి వారి పాప.

"మీకు ఫోనొచ్చింది" అని నా పని అయిపోయిందన్నట్లుగా తుర్రుమంది ఆ పాప. చాలా ఆశ్చర్యపోయాడు అప్పారావు. ఇప్పుడెక్కడ నుంచి ఫోను? ఎవరు చేసుంటారు? ఎందుకు చేసుంటారు? అసలీ ఫోను ఎవరికి తెలుసు? తనెవరికి చెప్పలేదే! ఈ ఫోను సంగతి ముగ్గురికే తెలుసు. రావు, మూర్తి క్రిష్ణ వీళ్ళలో ఎవరు చేసుంటారు? మొదలయిన విషయాలన్నీ అప్పారావు బుర్రని తొలిచెయ్యటం ప్రారంభించినయ్యి. అయితే ఫోను సంగతి జ్ఞాపకం వచ్చి తుండుగుడ్డ పైనేసుకుని ఎదురింటికి బయలుదేరాడు వాళ్లింట్లో కుక్క సంగతి మర్చిపోయి.

గేటు తియ్యగానే 'భౌ య్'మంటు గెంతిన కుక్కని చూసి గేటు మూసి వెనక్కి తిరిగాడు అప్పారావు.

"అప్పారావు! కుక్కని చూసి భయపడితే నువ్వెందుకు పనికొస్తావయ్యా? ఆఁ! కుక్కని నేను పట్టుకున్నా గావి ఫోను సంగతి చూడు'' అంటూ ఆ ఇంటాయన భరోసా ఇచ్చినాక ధైర్యంతో ఇంట్లోకి జొరపడ్డాడు.

''హల్లో! ఎవరు మాట్లాడేది?" అటు ప్రశ్నించాడు అప్పారావు ఫోనులో.

''నేను అప్పారావు! రావుని మాట్లాడుతుంట. అవును ఇవాళ ఆఫీసుకురాలేదు ఏమిటి సంగతి?'' అంటూ అవతలినుంచి ప్రశ్నించాడు రావు.

''ఆ! ఏంలేదు! వూరికినే. ఇంతకి ఫోను చేసావెందుకు?'' అంటూ ఎదురు ప్రశ్నించాడు అప్పారావు.

"నువ్వు వెంటనే ఆఫీసు కొచ్చెయ్. మన రిజల్ట్సు వస్తున్నయ్. తొందరగారా!" అంటూ అప్పారావు సమాధానం కూడా వినకుండా అవతల రావు ఫోను పెట్టేశాడు.

'రిజల్ట్స్' మాట వినగానే అప్పారావు గుండెలు గుబగుబలాడినయ్యి. ఆ తరువాత 'రాజధాని ఎక్స్ప్రెస్' స్పీడులో కొట్టుకోటం ప్రారంభించినయ్యి. ముచ్చెమటలు పోస్తున్నయ్యి.

"అదేమిటయ్యా అప్పారావు! అలావున్నావేమిటి ఇంతకి ఫోనెక్కడనుంచి" అప్పుడే లోపలికొచ్చిన ఇంటాయన ప్రశ్నించాడు.

''అబ్బే! ఏంలేదండి'' అంటూ ఆయన పిలుస్తున్నా వినిపించుకోకుండా ఆ ఇంట్లోంచి బైటపడి తన ఇంట్లోకి జొరపడ్డాడు అప్పారావు.

''ఫోనెక్కడనుంచండీ?'' అంటూ గుమ్మంలోనే ఎదురయ్యింది అప్పారావు భార్య.

"అఫీసునుంచి. మా రి జ ల్ట్స్ వస్తున్నాయిట" అంటూనే చొక్కా చేత పట్టుకుని బైట పడ్డాడు అప్పారావు.

"ఏమండోయ్! ఇలారండి" అంటూ వెనక్కి పిలిచిన భార్యని మింగేసేలా చూశాడు అప్పారావు.

"నే చెప్పిన సంగతి విని గూడా వెనక్కి పిలుస్తా వెందుకు" అంటూ విసుక్కున్నాడు అప్పారావు.

"మీ చాదస్తంగాని వెనక్కి వస్తేనే ఏమవుతుంది. ఏమీ గాదు. మీరు చొక్కా వేసుకోకుండా చేతపట్టుకుని వెళ్తుంటే అలాగే వెళ్తారేమోనని వెనక్కి పిలిచాను. చొక్కా వేసుకుని వెళ్లండి" అంటూ బదులిచ్చింది భార్య.

"నాకు తెలుసాసంగతి" అంటూ భార్యమీద విసుక్కుని తిరగేసి తొడుక్కోబోయి మళ్ళీ చూసుకొని సరిగ్గా తొడుక్కుని రోడ్డు మీద కొచ్చాడు అప్పారావు.

బస్ స్టాపు కొచ్చిన అప్పారావుకి గుండెదడ ఇంకా ఎక్కువయింది 'ఏమవుతుందో ఏమో! ఆ దేవుడిదయ వల్ల ఈసారన్నా పాసయితే బాగుండు. ఒకసారి కొండకెక్కి రావాలి. అంతా వాడిదే భారం' ఈ ఆలోచనలతో సతమతమవుతున్న అప్పారావుకి ఎదురుగా వస్తున్న బస్సుని చూసేటప్పటికి పైప్రాణాలు పైనే పోయినయ్యి. దానికి కారణం అ బస్సువాడు మంచి స్పీడులో వస్తున్నాడు. జనం అప్పటికే ఫుట్ బోర్డు మీద వేళ్లాడుతున్నారు. ఈ బస్సు పోతే మళ్ళా ఎప్పటికో బస్సు వచ్చేది !

అప్పారావు కోసమే అన్నట్లుగా సడన్ బ్రేక్ వేసి స్టాపులోనే బస్సు ఆపాడు డ్రైవర్. దాదాపు పాతిక ముప్పైమంది ఆ బస్సుకోసం ఎగబడ్డారు. అప్పారావు గూడా వాళ్లతో పాటు కుస్తీపడుతూ బస్సుకోసం ఎగబడ్డాడు. పట్టకేలకు బస్సు లోపలి రాడ్ అందుకుని ఒక కాలు ఫుట్ బోర్డు మీద పెట్టగానే బస్సు కదిలింది. బ్రతుకుజీవుడా అనుకుంటూ మరో నలుగురుతోపాటు ఫుట్ బోర్డు మీదే వేళ్లాడుతూ ప్రయాణం చేస్తున్న అప్పారావులో మళ్లీ ఆలోచనలు ముసురుకోటం ప్రారంభించినయి.

'ఏమవుతుందోఏమో! ఈసారైనా పాసైతేబాగుండు. అవును! రావుగాడు పార్టీ అడుగుతాడు. మరి క్రిష్ణ వూరుకుంటాడా! అందరికి కలిపి ఒకే పార్టీ ఇస్తేసరి ఆఫీసు క్యాంటీన్‌లో అయితే తక్కువౌతుంది. కాని వాళ్లు ఒప్పుకోవద్దూ. ద్వారకాలో కావాలంటారో లేక పోతే ఇంకెక్కడన్నా అంటారో.........' అంటూ పరి పరి విధాల ఆలోచిస్తున్న అప్పారావుకి "మొబైల్ కోర్టు" అంటూ ఎవరో అరవటంతో ఈ లోకంలో కొచ్చాడు. పై ప్రాణాలు పైనే పోయినయ్యి. మొబైల్ కోర్టువాళ్లు పట్టుకుంటే అయిదో పదో ఇచ్చుకోవాలి అనుకుంటూ లోపలికి పోవటానికి ప్రయత్నించాడు "లోపలికి పదండయ్యా" అంటూ. అయితే అప్పటికే ఆలశ్యం అయిపోయింది. కానిస్టేబుల్ వచ్చి చెయ్యి పట్టుకున్నా విదిలించుకోటానికి ప్రయత్నించాడు అప్పారావు. కాని వీలుపడలేదు.

"పద పద" అంటు అప్పారావుని పక్కసందులోకి లాక్కెళ్లాడు కానిస్టేబుల్. ఎదురుగా కనిపిస్తున్న మొబైల్‌కోర్టు బస్సుని చూడగానే ఏడుపొచ్చింది అప్పారావుకి.

"సార్ సార్! దయచేసి నన్నొదిలి పెట్టండిసార్! నేనాఫీసుకి పోవాల్సార్" అంటూ ఏడుపు మొహంతో కానిస్టేబుల్‌ని బతిమాలుకున్నాడు అప్పారావు.

"చాల్చాల్లే పద!" అంటూ బస్సులోకి నెట్టాడు కానిస్టేబుల్. ఇహ తప్పలేదు అప్పారావుకి. ఎదురుగా వున్న నల్లకోటాయన 'ఏమిటన్న'ట్టుగా కానిస్టేబుల్ వైపు చూశాడు. "ఫుట్ బోర్డు ట్రావెలింగ్" అంటూ సమాధానమిచ్చాడు కానిస్టేబుల్.

"అయితే పదిరూపాయలు" అంటూ తాపీగా సమాధానమిస్తూ అప్పారావు వంక చూశాడు నల్ల కోటాయన.

"అదికాదార్స్........." అంటూ ఏదోచెప్ప బోయిన అప్పారావు వంకచూస్తూ

''పదిరూపాయలు వున్నాయా లేవా?'' అంటూ ప్రశ్నించాడు నల్లకోటాయన. మళ్లానోరిప్పితే పదిహేను అంటాడేమో అని భయపడి అప్పారావు పాంటుజేబు లోని నల్లపర్సు తీసి పదిరూపాయలు ఇచ్చాడు.

రసీదిచ్చి ఇకవెళ్లవచ్చు అన్నట్టుగా చూశాడు నల్లకోటాయన. బ్రతుకు జీవుడా అంటూ బైటపడ్డ అప్పారావుకి ఈ గొడవలో మర్చిపోయిన రిజల్ట్స్ సంగతి జ్ఞాపకంవచ్చి టైము చూచుకున్నాడు. తను ఇంటినుంచి బైలుదేరి అరగంటయ్యింది. ఈ పాటికి మైక్ పెట్టుంటారు. రిజల్ట్స్ చదువుతూ వుండవచ్చు. ఎటూ పదిరూపాయలు పోయినయ్యి. కానీమనుకుంటూ ఎదురుగా వస్తున్న ఆటోని ఆపి ఎక్కికూచుని "ఏ. జి. ఆఫీస్" అంటూ స్టైలుగా చెప్పాడు అప్పారావు. ఆటోడ్రైవర్ ఒకసారి అప్పారావు వంకా ఎదురుగా సందులో కనిపిస్తున్న మొబైల్ కోర్టువంకా చూస్తూ చిన్నగా నవ్వుకుంటూ ఆటోని పోనిచ్చాడు.

ఆఫీసుకి చేరిన అప్పారావుకి గేటు దగ్గరున్న ముగ్గురు స్నేహితులని చూడగానే భయమేసింది. అయినా ధైర్యంగా ఆటోదిగి వాళ్లవేపు కదిలాడు.

''హల్లో! అప్పారావు'' అంటూ "ఏరామూర్తి! కాఫీ ఇప్పిస్తావా?'' అంటూ మూర్తివైపు తిరిగాడు రావు.

''తప్పుతుందా! పదండి" అంటూ బయలుదేరాడు మూర్తి.

''ఎక్కడికిరా ఇంతకీ?'' అంటూ వాళ్లవెనకే బయలుదేరిన అప్పారావుకి ఆఫీసంతా ప్రశాంతంగ కనబడటంతో, కొంచెం అనుమానం వేసింది.

''కాఫీకి అంటూ సమాధాన మిచ్చి "ఒరేయ్! అప్పారావు! ఇంతకీ అసలు సంగతేమిటంటే నేను, మూర్తిగాడు పందెం వేసుకున్నాం. అప్పారావుని ఏప్రిల్‌ఫూల్ చెయ్యగలనని నేను, చేయ్యలేనని మూర్తి గాడు పందెం వేసుకున్నాం. పథకం ప్రకారం నీకు ఫోన్ చేశాను. నువ్వొచ్చావు. నేను పందెం గెలిచాను. మూర్తిగాడు కాఫీ ఇప్పిస్తున్నాడు. అదీ సంగతి!'' అంటూ తాపీగా సమాధానమిచ్చి ''పోతే రిజల్ట్స్ రాలేదు ఇవాళ మాత్రంరావు'' అంటూ అసలు విషయం బైట పెట్టాడు రావు. అంతే మతిపోయినంత పనయ్యింది అప్పారావుకి. మొబైల్ కోర్టుకి చదివించు కున్న పది రూపాయలు ఆటోవాడికిచ్చిన మూడు రూపాయలు జ్ఞాపకంవచ్చి మూర్ఛ వచ్చినంత పనయింది.

''ఏరా! అప్పారావు! అలా వున్నావేం?" అంటూ ప్రశ్నించిన మూర్తిని మింగేయాలన్నంత కోపం వచ్చింది అప్పారావుకి కాని తమాయించుకొని

"అనవసరంగా నన్ను హడావిడి పెట్టారుగదరా!'' అంటూ ఏడవలేక నవ్వుతూ అన్నాడు అప్పారావు అసలు సంగతి బైటపెట్టలేక.